
# చెమ్మగిలిన కళ్లు



కథానిక

"వల్లపురెడ్డి"

డిసెంబరు ఆఖరు వారంలో శీతాకాలపు సెలవులిచ్చారు కళాశాలలకు. హయిదరాబాదునుండి ఇంటికి వస్తున్నాను. రాత్రిమెయిలుకు ప్రయాణం కట్టడం మూలాన ఆ రాత్రంతా నిద్దరేలేదు. రెండున్నర గంటలకు స్టేషనులో దిగినా, ఒక్కసారి కూడా కన్నుమూయలేదు. ట్రెయినులోగాని స్టేషనులోగాని నిద్రపోవటం నాకు అలవాటులేదు. దీనికి తోడు చలి విపరీతంగా ఉంది. రైలులో ఉన్నంతవరకు చలి తన ప్రభావాన్ని నాపై ఏమాత్రమూ చూపలేకపోయింది; కాని స్టేషనులో దిగటంతోనే కక్ష సాధించటం మొదలెట్టింది. శరీరంలో రక్తమంతా గడ్డకట్టుకు పోతూన్నట్లుంది.

కష్టాలెప్పుడూ ఒంటరిగారావు. రైల్లోఉన్నంతసేపూ చిల్లరవస్తువుల వేలాన్ని చూస్తూ బిక్షగాళ్ళ పాటల్ని, ఇతరవ్యక్తుల భాషణల్ని వింటూ కాలక్షేపం చేశాను. కాని ఇప్పుడు చలిబాధ ఎక్కువగాఉంది. పైగా ఏకాంత మొకటి దాపురించింది. నాకు ఏకాంతమంటే మక్కువే; కాని ఈ చలిలో దాన్ని భరించలేకుండా ఉన్నాను. అందరూ ఎవరికి తోచినట్లు వారు తెచ్చుకున్న గుడ్డల్ని కప్పుకుని ప్లాటుఫారంపై పడుకుని వణకుతూ వణకుతూ క్రమంగా నిద్రాదేవి పరిష్వంగ సౌఖ్యాన్ననుభవించ సాగారు. నేనొక్కడిని మాత్రం అందరి బాహువుల్లో నలిగిపోతూన్న ఆ నిద్రాదేవతను ఆ సమయానికి పతితగా నెంచి పరిగ్రహించలేకపోయాను. ఇంటిదగ్గరనే అయియుంటే ఆమెనే నా నిశా సామ్రాజ్య ప్రణయదేవతగా భావించి, ఆమె మాధుర్య స్పర్శను వీడక నా వెచ్చని కౌగిలిలో బంధించి యుండే వాడినేమో! జరగని వాటినన్నిటినీ ఇప్పుడు తచ్చిచూడటం దేనికి? ఇంతకూ నేనుమాత్ర మా సమయంలో సమయం గడువక క్షణాల్ని, నిమిషాల్ని, గంటల్ని లెక్కపెడుతూ మూగపోయి కూర్చున్నాను.

* * *

టంగ్, టంగ్, టంగ్; నాలుగు, అయిదు, ఆరు గంటలయింది. స్టేషను గడియారపు గంటల చప్పుడుతోబాటు బయట నిలబడియున్న సర్కారు బస్సుల హారన్ కూడా వినిపించింది. అంతవరకు ఏ లోకంలోనో —ఊహాలోకంలో— పడి చలిని కాస్తయినా విస్మరించిన నేను, అనుకోకుండా బస్సుల్లో ప్రయాణించుటకై హడావిడి చేస్తూన్న జనాన్ని చూడాల్సివచ్చింది. చలి మళ్ళీ ఒకసారి తన తడాఖా చూపింది నామీద. అయినా, దాని అల్లరిని సహిస్తూ నా సంచీ చేతిలో పట్టుకునిలేచి తిన్నగా అడుగులు వేశాను. తోటి ప్రయాణీకులంతా మూట్టాముల్లె సర్దుకుని హుటాహుటిగా వెడుతున్నారు. చలికి వణకుతూ ఎంతో ప్రయాసంతో వెళ్ళి బస్సులో కూర్చున్నాను.

ఇరవై సంవత్సరాల నిండు యువకుడిని నేనే ఇలా కంపిస్తూఉంటే ఇక వయస్సు మళ్ళినవారి సంగతిని వేరే వ్రాయనక్కరలేదనుకుంటా. కిటికీలు, దరవాజాలు బంధించి, వారి విస్తృత సామ్రాజ్యమగు బస్సులో హాయిగా నిద్రించిన కండక్టరు,డ్రైవరులేచి ఎవరి స్థానాన్ని వారు తీసుకున్నారప్పుడే.

సీట్లు దొరకని వాళ్ళు నిల్చుండలేక కూర్చున్నారు బస్సులోనే. చలి ప్రభావానికి లోనైన బస్సును స్టార్టుచేయటానికి కూలీలు కొంచెం శ్రమపడ్డాల్సి వచ్చింది.

బస్సు కదిలింది. అందరూ తమ గమ్యస్థానాలకు చేరుకుంటామని ధృఢంగా నమ్మటానికి వీలు చిక్కింది.

బస్సులో కొన్నిసీట్లు మహిళలకు ప్రత్యేకింపబడియున్నాయి. ఆ సీట్లచుట్టూరా ఒక పరదా గూడయుంది. ఆ స్థలంకూడ మహిళలతో నిండియే యుంది. సీట్లచుట్టూ కట్టబడిన తెర ఎవరో ఘోషాస్త్రీలు—ప్రత్యేకంగా ముస్లింలు—వస్తేనే గాని పూర్తిగా మూయఁబడదు. ముస్లింలలోనూ 'బురఖాల తల్లులు' వస్తే పూర్తిగా మూయఁబడుతుంది.

అంతసేపూ అనుక్షణము వణికించిన చలి ఎందుకో ఒక్కమాటుగా వదిలిపెట్టి పోయింది నన్ను. ఒక కారణం నా ప్రక్కగాఉన్న బస్సు వాతాయనాలు బంధించటం అయినప్పటికీ దాని మహత్తర కారణం నా దృష్టి మరోదృశ్యంపై సంపూర్ణంగా కేంద్రీకరింపఁబడటమే.

ఎదురుగాఉన్న మహిళల స్థలాన్ని పరివేష్ఠించిన యవనికపైపడింది నాచూపు. ఒకప్రక్క కొంచెం తొలగిపోయి ఉందా తెర. ఆనాడు బురఖాస్త్రీలు ఎవరూ లేకపోయినప్పటికీ ఆడవాళ్లు చలినుంచి తమను తాము కాపాడుకోటానికి దాన్ని జేర్చియుంటారు. పరదా సంప్రదాయం కలస్త్రీలు ఎవరైనా ఉండియుంటే తెర అంత అశ్రద్ధగా అలా తొలగియుండేదికాదు. నా చూపు అందులోంచి దూసుకుపోయేదికాదు.

ఆ పరదా సందులోంచి ఇరువురి ముఖాలు చక్కగా అగుపడుతున్నాయి. ఒకామె పద్ధెనిమిదేళ్ళయువతి. రెండో ఆమెకు కనీసం ముప్ఫయి అయిదేండ్లయినా దాటియుంటాయి. మొదటి మహిళకామె మాతృదేవి అయియుంటుందని ప్రథమ వీక్షణంలోనే కనుకున్నా.

రెండో ఆమె తన యౌవనంలో ఇంకా ఎలా యుండేదేదోకాని ప్రస్తుతం మాత్రం అందమైన స్త్రీలలోనే జమకట్టవచ్చు. పద్ధెనిమిదేళ్ళ యువతి, తల్లిపోలికలతోయున్నా పసిడివెన్నెలతో మిడిసి పడుతూన్న ఆమె దేహకాంతి, ఒలికిపోని నిండు జవ్వనం, బట్టలకట్టు మొదలగువాని ప్రత్యేకతవల్ల మెరసిపోతూంది. ఆమె నొకసారి కన్నులారా చూశాను. ఆమెకూడా నా ముఖంలోకిచూసింది. ఎవరైనా చూస్తారనే భయంకొద్దీ కళ్ళు వెంటనే దించుకుని ఇంకోతరుణాన్నపేక్షిస్తూ కూర్చున్నా.

"మిస్టర్ టికెట్" అంటూ బస్సు కండక్టరు మెల్లిగా చరచాడు భుజంమీద. అతడుపరిచయం కలవాడే. అతనిపై ఎందుకో అనవసరంగా కోపం వచ్చింది; కాని చలాయించుకోలేక పోయినా. జేబులోనుంచి రూపాయితీసి వాడిచేతిలోపెట్టి, మధ్యలో అంతరాయం కలిగించినందుకు వాడిని మనస్సులో నూరు హత్యలు చేసినాను.

స్టేషను నుండి మా ఊరికి నేరుగా ఒక బస్సు ఉన్నా, ఈ బస్సులో నేను స్కూలుఫైనలు పూర్తిచేసి బస్తీకి వెడుతున్నా, అక్కడినుండి మా ఊరికెడదామనే తలంపుతో.

టికెట్టూ, నాల్గణాలున్నూ నా చేతిలోపెట్టి ముందుకు సాగిపోయాడు కండక్టరు. పరిచయం కలవాడు కనుక నేనెక్కడికి వెళ్లాలో అడక్కుండానే సరియైన టికెట్టు ఇవ్వగలిగాడు.

కళ్లెత్తి పరదా సందులోగుండా మరోసారి చూశాను. ఆమెగూడా అప్పుడే నా కళ్ళలోకి చూసింది. ఆమె తల్లిగూడా చూసింది నావైపు. ఆమె నన్నొకసారి నావైపు చూస్తున్న తన కూతురొన్నొకసారి చూసింది. కూతురు చూపుల్ని దాచుకుంది. నేనూ కళ్లను మరల్చుకున్నా. ఆమె అందాన్నిగూర్చి తలపోయటం ప్రారంభించాను.

ఆమె ఎంత అందంగా యుంది! మీనాల్లాంటి నయనాలు, అరుణరాగాల్నీను తను కపోలాలు, విశాలమైన ఫాలం, పొడవయి అందమైన మెడ. ఎన్ని అని అలా వ్రాయటం? నేను రాటుదేరిన కవినైయుంటే ఆమె ప్రతి అంగంపైనా ఒక ఉద్గ్రంథంవ్రాసి యుందును. కాని ఆ భాగ్యం నాకబ్బలేదు. ఆమె ప్రతి అవయవంలోనూ ఏదో, కవుల వర్ణనలకూ, శిల్పుల విగ్రహాలకూ, చిత్రకారుల చిత్తరువులకూ లేని అతీతత్వం ఉంది.

నాకు తెలుసు; నాకామెలోని అందంలో శతసహస్రాంశమైనా లేదని. నారూపుచూస్తే,

చిన్నపిల్లలు మూర్ఛపోతారనుకుంటూ భయంచే. అయినా, నన్నామె అప్పుడప్పుడు చూస్తూ వెంటనే కళ్లుముడుచుకుంటూంది. క్రిందటి రెండు సంవత్సరాలనుండీ ఈనాటివరకు నన్ను కొందరు తదేకంగా చూశారు. నేనూ వారి చూపుల్ని చూపులతోనే సన్మానించాను. అద్దంలో చూసుకొంటే నా ముఖమే నాకు మొఖంమొత్తుతుంది, అలాంటిది ఈమె ఇలా చూడటంలో అర్థం? ఆలోచించినా ఎంతకూ తెలియలేదు.

వారిరువురి వదనాలూ ఏదో అనిర్వచనీయమైన దీనత్వంతో ఆవరింపఁబడినట్లున్నాయి. ఆకళ్లలో ఏదో విషాదగాథ నిగూఢమై యున్నట్లుంది. ఆగాథ నాకు తెలియటమెట్లు? తెలిసినా నేనేమాత్రం సహాయం చెయ్యగలను? ఒకరి బాధల్ని ఒకరు పంచుకోక పోయినా సానుభూతితో వినే వారికి చెబితే విషాదజీవులగుండె బరువు కొంచెం తగ్గుతుంది. అదిగాక వినాలని కుతూహలమున్న వ్యక్తికిగూడా కొంచం జాలికన్పరచి, ఎదుటి జీవి జీవితంలో ఎదుర్కోవల్సిన కడగండ్లకు కావాల్సిన ధైర్యోక్తులు పలకటానికైనా అనువు చిక్కుతుంది. కాని నాకు అలాంటిది వలనుపడలేదు.

అంతటి విచారంతో ఆవరింపఁబడి యున్నప్పటికీ ఆ ముఖాలలో దరహాసం గోచరిస్తూంది. వాళ్ల దైన్యాన్ని చూసి నాగుండె చెఱువైపోయింది. వాళ్లకళ్లలో బాష్పాలుగూడా స్పష్టంగా అగుపడుతున్నాయి. అవి మౌక్తికాల్లా మెఱుస్తూ ఏదో గాథను బయల్పరుస్తున్నాయి; కాని నాకు వాటి భాష తెలీదు.

ఎల్లప్పుడూ నూనెగారుతూ, నీరసంగాయుండే నాముఖంలో కొంచం కళ తీసుకురావాలని ప్రయత్నించాను. ఎందుకంటే చిరునవ్వేలేని నాముఖాన్ని చూసి, నేనే ఏదో వైక్లబ్యంలో మునిగియున్నట్లు భావించి వారు నాకొఱకై తమ కనుదమ్ములలో బాష్పమౌక్తికాల్ని నిలుపుతున్నారేమో నను కున్నా. ఆమెను చూసినప్పుడు ఒకటిరెండు సార్లు కొంచం నవ్వటానికి యత్నించాను. ఒకసారి ఆమెగూడా తన పెదవుల్ని విప్పింది. అరవిప్పిన పెదవులమధ్య ముత్యాల్లాంటి తెల్లని పలువరుస విద్యుల్లతలా మెఱసిపోయింది. ఆ సమయంలో ఆమెకు భూతానుభూతులేమైనా స్ఫురించాయేమో! చిక్కిన సమయాల నన్నిటినీ వృథాచేయకండా ఆమెను చూశాను ఆమెకూడ నేను చూసినప్పుడల్లా నన్నుచూసింది. ఆమె తల్లికూడా నన్నెన్నో మార్లు చూసి, వెనువెంటనే నావైపు చూస్తున్న బిడ్డముఖంలోకి చూట్టం తటస్థించింది. ఆ ముఖాల్లో దైన్యంవినా మరేమీలేదు. ఆమె ముఖాన్ని జ్ఞాపకానికి తెచ్చుకుంటే విసుగు లేకుండా వ్రాసిందే వ్రాయాలనిపిస్తూంది.

బస్సు ఎన్నిచోట్ల ఆగిందో తెలీదు. గమ్యస్థానం దగ్గిర, అంటే నేనుదిగాల్సిన బస్తీలో ఆగేసరికి అందరూ సామాన్లు సర్దుకుంటున్నారు దిగటానికి. కూలీల కేకలు విన్పడినై. నేను ఆమె చెమ్మగిలిన నయనాల్లోకి చూస్తూనే బస్తాచేతిలో పట్టుకుంటున్నాను.

"లేవే... లేమ్మా" అంది కూతురుతో తల్లి. ఆ మాటలు కడుభారంగా, వేదనా భరితమై యున్నాయి. ఆమె లేస్తూ కూతుర్ని పిలిచింది.

కూతురు లేవటానికి ప్రయత్నించింది.

ఏమిటది? ఆమె ఒళ్లో కదుల్తూంది? జారిపోయిన పమిటను సర్దుకోబోతూంటే ఆమె వక్షమధ్యంలో మంగళసూత్ర మగుపడింది. అయ్యో ఆమె వివాహితయా? పరవనితని కన్నెత్తి చూడగూడదే! ఏదో మహాపచారం చేసినట్లు మనస్సులో మధనపడ్డాను. తెలియకచేశాననుకుని నామట్టుకు నేనే వేదననుండి విముక్తి చెందాను.

ఒళ్లో కదిలిన వస్తువును తీసుకుని లేచిందామె. సంవత్సరం, సంవత్సరార్థం మించని పసిపాపడు. ఆమె బిడ్డడే ననుకుంటా. ఆమె రూపురేఖలన్నీ ఆ బాలుని వదనాంబురుహంలో అచ్చు గుద్దినట్లున్నాయి. లావుగా, అందంగా ఫోటోలలోని బాలకృష్ణుడిలాగున్నాడు. తల్లికి తగిన బిడ్డడు.

వాళ్లు ముందు దిగారు. ఇరువురూ నాముఖంలోకి చూశారొకసారి. నేనూ వారివెంటనే దిగి, అక్కడే కలిసిన ఒకమిత్రునితో మాట్లాడుతూ నిల్చున్నా కాస్సేపు. వాళ్లు ముందుకు సాగిపోయారు; మెల్లిగా, భారంగా అడుగులువేస్తూ. ఆమె అడుగులవైపు జాలిగాచూస్తూ మిత్రునితో మాట్లాడుతున్నా.

మిత్రునికి స్వస్తిచెప్పి బస్తీలోకి నడిచాను. వారికీ, నాకూ మధ్య ముప్ఫయి, లేక నలుబది గజాలదూరముంది. నా అడుగులు వేగంగా పడినయి. వారికి మధ్యలోనే ఇంకా ఇరువురుస్త్రీలెవరో కలిశారు. వారూ బస్తీవాళ్లే. ఒకర్నొకరు తారసిల్లటంతోనే పరస్పరం సందిళ్ళలో వాలిపోయి ఏవో విషాదరాగాలు తీస్తూ ఏడ్వటం మొదలిడారు పమిటలు ముఖాలకు కప్పుకుని. ప్రపంచాన్నర్థం చేసుకోలేని ఆ బాలుడి చూపుల్లో నా చూపుల్లో భేదం కానరాక పోయిందా క్షణంలో. ఎంతసేపు నిల్చున్నా వారు నన్ను, నేను వారిని చూడటం తటస్థపడలేదు. సంగతేమిటో కనుక్కుందామంటే ఎవరూ తగినవాళ్లు దొరకలేదు. నాఅంతకు నేనే 'ఏమిటా?' అని ఆలోచిస్తూ ఆ బస్తీలో చదువుతూన్న మావూరి విద్యార్థుల గృహానికి వెళ్ళాను.

అక్కడ తెలిసి వచ్చింది అసలు విషయం. ఎవరో ఒక యువకుడిని దాయాదులు ద్వేషంతో హత్యచేశారని విద్యార్థులు చెప్పుకుంటూంటే విన్నా. అతనికి పెళ్ళయి మూడేళ్లే అయిందని, భార్యకు ఒక పిల్లడని. ఆ మాటలు వింటూంటే నాకు సరిగ్గా బస్సులోజరిగిన ఘట్టం మళ్ళీ ఒకసారి కళ్ళముందు కొచ్చింది. ఈ విన్నమాటలన్నీ ఆమె చరిత్రకు మూలవాక్యాలని నిర్ధారణ అయింది.

నా మనస్సెందుకో నిలువలేక పోయింది. విద్యార్థుల మాటలవల్ల తెలిసిన ఆ హత్య జరిగిన చోటకు త్వరత్వరగా చేరాను. అందరూ మూగి ఏడుస్తున్నారు. కొందరు సానుభూతి చూపుతున్నారు. ఆమె బంధుజనం కాబోలు కళ్ళలోంచి ఏకధారగా అశ్రువాహినుల స్రవింపజేస్తున్నారు. ఆమె భర్త పాదాలపైబడి ఘోరున విలపిస్తూంది. ఆ దృశ్యం హృదయవిదారకంగా యుంది.

అప్పుడే పోలీసు అధికారి వచ్చాడు. వివరాలు వ్రాసుకుని దహనానికి అనుమతిచ్చాడు. ఆమెను ఆ సమయంలో ఎందరో పట్టి బలవంతాన దూరంగా నిలబెట్టారు. ఆమె స్థితిని చూస్తే నా కళ్ళూ చెమ్మగిలి అశ్రుసిక్తాలయినయి. అప్పుడామె దూరం నుండి మళ్ళీ ఒకసారి నా చెమ్మగిలిన నయనాల్లోకి అవలోకించింది.

పోలీసు అధికారి వివరాలు వ్రాసుకుంటూంటే చూశాను చనిపోయిన ఆమె భర్తను. ఆమె, ఆమె తల్లి నన్నెందుకలా చూశారో తేటపడింది. మృత్యువును ఆలింగనం చేసుకున్న వ్యక్తి అచ్చంగా నావలెనే యున్నాడు. నా రూపే. కుడి ఎడమలుగా యుంటాయి మా ముఖాలు.

ఆమె పిల్లాడిని ఎవరో వేరొకామె ఎత్తుకుని యుంది. ఆ సమయంలో జాలిగుండె గలవాళ్ళంతా బంధువులే. శవానికి అంతమ క్రియల జరపటానికి తీసుకువెళ్ళారు. నేనూ అనుసరించా జనాన్ని. పోతూపోతూ ఆ బాలుడిని ఒకసారి తీసుకున్నా నా చేతుల్లోకి, ఆమె నడిగి. పిల్లాడు అమాయికంగా నన్ను చూశాడు. పాపం! జరిగిన దుంఖసంభరిత ఘట్టపు వాసనలనైనా గ్రహించలేని మనసు. నా ముహంలోకి చూసి నవ్వాడు బోసినవ్వు. ఆమెకు తిరిగి ఇచ్చేశా. ఇస్తూంటే ప్రక్కనే నడుస్తూన్న ఆ పిల్లాడి తల్లి నన్నుచూసింది. ఆమె కళ్ళనుండి నీళ్ళు జలజలా రాలాయి.

భౌతిక దేహాన్ని గోతిలోనికి దించుతుంటే రోదన లాకాశాన్ని ముట్టినయి. అయినా ఆగలేదు. అందరూ మన్నువేశారు. ఆమె గోతికి ఆవతలిప్రక్కన నిలబడి మన్ను వేస్తూంటే నేనూ ఇవతలివైపునుంచి ఆచారం ప్రకారం కొంచం వేశాను. ఆమె కన్నుల్లోకి తుదిసారి చూసి మృత్యువును కౌగిలించుకున్న ఆమె భర్త ఆత్మశాంతికై, ఆమె భావిజీవన సౌఖ్యంకోసం భగవంతుడిని క్షణంసేపు ప్రార్థించి వెనక్కి మరలాను గుండె బరువుతో.

ఈ ప్రపంచంలో "నాకొరకు చెమ్మగిలునయనమ్ము లేదు" ఉండగూడదనియే నా ఇచ్ఛ. కాని అవసరమైతే ఇతరులకొరకు నా నయనాల్ని చెమ్మగిల చేస్తాను. ప్రయత్నపూర్వకంగా జాలిని బహిర్గతం కాకండా ఉంచుదామన్నా సాధ్యం కాదు. దుఃఖ ఘట్టం కట్టెదుట గోచరించటంతోనే అప్రయత్నంగా కన్నులు చెమ్మగిలుతాయి.

ఆమెరూపు, ఆదృశ్యం నా చూపులో సంచరించినపుడెల్లా నా కళ్ళెందుకో యీ నాటికీ అశ్రులు రాలుస్తాయి.